

844 కేంద్రాల్లో ఉల్లాస్ అర్హత పరీక్ష


పార్వతీపురం రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) జిల్లాలో 844 కేంద్రాల్లో ఆదివారం ఉల్లాస్ అర్హత పరీక్ష నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం గంటల లోపు వయోజనులకు వీలున్న సమయంలో వచ్చి ఈ పరీక్ష రాశారు. మొత్తంగా 20,915 మంది హాజరయ్యారు. చదవడంలో 50 మార్కులు, రాయడానికి 50 మార్కులు, గణితానికి 50 మార్కులతో పరీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి టి.వైకుంఠరావు ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

గిరిజనుల గొంతెండుతోంది!

- ఏజెన్సీలో దాహం కేకలు
- చుక్కనీరివ్వని గ్రావిటేషన్లు
- కొన్నిచోట్ల పనిచేయని బోర్లు, సోలార్ వాటర్ స్కీములు
- ఎండల తీవ్రతతో ఎండిన ఊటలు, చెలమలు
- వేసవి ప్రారంభంలోనే గిరిపుత్రులకు తప్పని ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని విన్నపం



కొండ దిగువ ప్రాంతం నుంచి నీరు తీసుకొస్తున్న అంటిమానుగూడ గిరిజన మహిళలు



జేపి లాడ గ్రామంలో అలంకారప్రాయంగా మారిన సోలార్ వాటర్ స్కీమ్ ట్యాంక్



అంటిమానుగూడలో పనిచేయని కుళాయి

సీతంపేట రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

సీతంపేట ఏజెన్సీలో గిరిపుత్రుల గొంతులెండుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే అంతటా దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ఊట బావులు, చెలమల్లో నీరు ఎండిపోయింది. గ్రావిటేషన్లు చుక్కనీరివ్వడం లేదు. కొన్ని చోట్ల బోర్లు, సోలార్ వాటర్ స్కీములు పనిచేయడం లేదు. దీంతో బిందెడు నీటి కోసం వారు కొండ ఎక్కి, దిగాల్సి వస్తోంది. కొండ దిగువన ఉన్న గిరిజన గ్రామాల్లో కొంత వరకు పరిస్థితి మెరుగ్గానే ఉంది. గిరిశిఖర గ్రామాలకు మాత్రం వేసవి కష్టాలు వెంటాడుతున్నాయి. ఒకవైపు వేసవితాపం మరోవైపు రహదారి కష్టాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- సీతంపేట మన్యంలో 53 పంచాయతీల పరిధిలో 516 గిరిజన గ్రామాలు ఉన్నాయి. గ్రావిటేషన్ ఫ్లో పథకం ద్వారా ఇంతవరకు ఆయా గ్రామాలకు నీరు అందుతూ వస్తోంది. అయితే ఎండలు మండుతుండడంతో ప్రస్తుతం చుక్కనీరు రావడం లేదు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో సుమారు వందకు పైగా గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. మార్చి నెలలోనే ఈ పరిస్థితి ఉందంటే రానున్న ఏప్రిల్, మే నెలలో ఇంకెలా ఉంటుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలు

కొండాడ, దారపాడు, పూతిక వలస, చినబగ్గ, పెదరామ, చింతాడ, శంభాం, చాకలిగూడ, కిండంగి పంచాయతీల పరిధిలో అంటిమానుగూడ, చీడిమానుగూడ, గెద్దగూడ, జేపి లాడ, లాడ, గొలుకుప్ప, దబర, పూతికగూడ, ఈతమానుగూడ, బీరపాడు, లోకొత్తవలస, జాతాపు పొంజాడ తదితర గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఈ గ్రామాల్లో చాలా వరకు ఎత్తైన కొండ ప్రాంతాల్లో ఉన్నాయి.

అధికారిక లెక్కలు ఇలా..

సీతంపేట మన్యంలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాలు తక్కువగానే ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నివేదికల ద్వారా తెలుస్తోంది. మండలంలో 16 పంచాయతీల్లోని 475 హేబిటేషన్లలో కేవలం 16 గ్రామాల్లో మాత్రమే నీటి ఎద్దడి ఉన్నట్లు రికార్డుల్లో చూపారు. కానీ వాస్తవానికి చాలా గిరిజన గ్రామాల్లో గిరిజనులు చుక్క నీటి కోసం అల్లాడుతున్నారు. సోలార్ వాటర్ ట్యాంక్‌లు, గ్రావిటేషన్ ఫ్లో పథకాల నుంచి నీరు రావడం లేదు. దీంతో గిరిజన మహిళలు, చిన్నారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి గెడ్డలు, బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు.

అధికారులు గుర్తించిన గ్రామాలు..

దారపాడు, కిరప, నాయకమ్మగూడ, చిన్నబగ్గ, దారబ, దారపాడు, దేవనాపురం, హడ్డుబంగి, పెద్దగూడ, పెదరామ పంచాయతీల పరిధిలో గొలుకుప్పగూడ, పెద్దగూడ, మర్రిమానుగూడ, ఎగువ సంకిలి, ఎగువ దారబ, చింతమానుగూడ, రామానగరం పెద్దగూడ, జేపి జంతలగూడ, జేపి మధ్యగూడ, జేపి రామన్నగూడ, అయ్యప్పగూడ (మిగతా 8వ పేజీలో..)



ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

- 31వ 'మిస్టర్ ఆంధ్రా' బరిలో 200 మంది
- విజేతలకు బహుమతుల ప్రదానం

8లో

భగత్‌సింగ్‌కు నివాళి

8లో

భామిని, గుమ్మలక్ష్మీపురంలో అకాల వర్షం

8లో

నియామక పత్రాలు ఎప్పుడో?

- డీలర్ పోస్టుల ఫలితాలు వెలువడినా అందని వైనం

గరుగుబిల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పరిధిలోని చౌక ధరల దుకాణాలకు ఎంపికైన నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్నారు. పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో డీలర్ల నియామం కోసం గతేడాది డిసెంబరు 9న నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హులైన వారి నుంచి 18 వరకు దరఖాస్తులు స్వీకరించారు. 19న పరిశీలన చేశారు. పార్వతీపురం డివిజన్‌కు సంబంధించి బలిజిపేట, గరుగుబిల్లి, కొమరాడ, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం మండలాల నుంచి 36 దుకాణాలకు 285 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 63 దరఖాస్తులు తిరస్కరించారు. అలాగే పాలకొండ డివిజన్‌కు సంబంధించి 20 చౌక ధరల దుకాణాలకు 64 మంది పరీక్షకు హాజరయ్యారు. రెండు డివిజన్ల పరిధిలో 56 డీలర్ పోస్టులకు 266 మంది పోటీ పడ్డారు. సంబంధిత అభ్యర్థులకు డిసెంబరు 21న హాల్ టిక్కెట్లు జారీ చేశారు. వీరికి 23న రాత పరీక్ష నిర్వహించి 26వ తేదీన ఫలితాలను ప్రకటించారు. రాత పరీక్షలో అర్హత పొందిన వారికి 28న మౌఖిక పరీక్ష కూడా నిర్వహించారు. 30న ఫలితాలను ప్రకటించారు. 56 దుకాణాలకు అర్హత పొందిన వారి జాబితాను జనవరి 10న వెల్లడించారు. ఎంపికైన వారి వివరాల పరిశీలనకు సంబంధిత తహసీల్దార్లకు కూడా పంపించారు. అనంతరం అభ్యర్థుల పూర్వాపరాలను సేకరించారు.

ఎన్నికల కోడ్ రావడంతో..

నియామక పత్రాలు అందిస్తారన్న తరుణంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఎన్నికలు జరిగి, కోడ్ కూడా ముగిసింది. నియామక పత్రాలు అందించేందుకు ప్రస్తుతం ఎటువంటి ఆటంకాలు లేవు. అధికారులు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించాలని అభ్యర్థులు కోరుతున్నారు. నియామక పత్రాల విషయమై పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించగా పైనుంచి ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన తక్షణమే నియామక పత్రాలను అందిస్తామన్నారు.



డీలర్ల రాత పరీక్షను పరిశీలిస్తున్న పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ (ఫైల్)



తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంతం ఇలా..

తోటపల్లిలో నీటి నిల్వలు తగ్గుముఖం

గరుగుబిల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. ప్రాజెక్టు సామర్థ్యం 2.534 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.109 టీఎంసీలుగా ఉంది. పైప్రాంతం నుంచి 150 క్యూసెక్కుల నీరు చేరగా, నదీ మార్గం గుండా 50 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ నుంచి 150 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు. వీరఘట్టం, పాలకొండతో పాటు శివారు ప్రాంతాల వారికి తాగు నీటి సౌకర్యార్థం గత కొద్ది రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నవిరి ప్రాంతంలో నదిలో పాత రహదారి కూడా బటయకు కనిపిస్తోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో స్పిల్‌వేకు ఆనుకున్న ప్రాంతంతో పాటు దిగువకు వెళ్లే మార్గంలో నీటి నిల్వలు తగ్గు ముఖం పట్టాయి. దీంతో ఖరీఫ్‌లో రైతులకు కష్టాలు తప్పేలా లేవు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు ఆహ్వానం

పార్వతీపురం,మార్చి23(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. 21 నుంచి 24 మధ్య వయసున్న నిరుద్యోగులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ ఉత్తీర్ణులైన వారు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 500పైగా ప్రముఖ పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం పొందొచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మృత్యువులోనూ వీడని బంధం

- లారీ ఢీకొని దంపతుల మృతి
- సాలూరులో ఘటన
- వంగరగుడ్డివలసలో విషాదం



మజ్జి రాము (ఫైల్)




మజ్జి గురుబరి (ఫైల్)

సాలూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ దంపతులు. పని నిమిత్తం సాలూరుకు వచ్చారు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ రూపంలో వారిని మృత్యువు కబళించింది. ఈ ఘటన సాలూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు మండలం నెలిపర్తి పంచాయతీ వంగరగుడ్డివలస గ్రామానికి చెందిన మజ్జి రాము (51), మజ్జి గురుబరి(47) భార్యాభర్తలు. వీరిద్దరూ ఆదివారం ఉదయం కుటుంబ పనుల నిమిత్తం సాలూరుకు వచ్చారు. పనులు ముగించుకొని ఆదివారం రాత్రి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సాలూరు వై జంక్షన్ బైపాస్ రోడ్డు వద్ద ఒడిశా నుంచి రామభద్రపురం వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రాము, గురుబరి దంపతులకు పిల్లలు లేనట్లు సమాచారం. వీరి మృతితో వంగరగుడ్డివలసలో విషాదఛాయలు అలముకున్నాయి.

టీబీ కేర్‌ఫుల్


- జిల్లాలో తగ్గని క్షయ (టీబీ) బాధితులు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినం



టీబీ కేంద్రంలో క్షయ నిర్ధారణ చేసే సీబీనాట్ పరికరం



టీబీ లక్షణాలున్న వారి ఇంటి వద్దే పరీక్షలు చేపట్టే హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మిషన్



పాలకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో క్షయ (టీబీ) కేసులు గతంతో పోలిస్తే కాస్త తగ్గినా పూర్తిగా అదుపులోకి రావడం లేదు. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ కేసులు నమోదవుతున్నాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలికంగా దగ్గు వస్తున్నా సాధా రణమే కదా అని తేలిగ్గా తీసుకుంటున్నారు. రెండు వారాలకు మించి దగ్గు వేధిస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్లె పరీక్ష చేయించుకోవాలి. ఆదిలోనే సరైన వైద్యం తీసుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదని వైద్యులు చెబుతున్నారు.

క్షయవ్యాధి కారకమైన బ్యాక్టీరియా (మైకో బాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్)ను డాక్టరు కోచ్ కనుగొన్న తర్వాత శతాబ్ది వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా 1942 నుంచి ఏటా మార్చి 24న ప్రపంచ టీబీ దినం పాటించాలని చెప్పింది. ఈ రోజున దేశవ్యాప్తంగా వ్యాధి తీవ్రతపై చర్చలు నిర్వహించడం.. నివారణ మార్గాలను సూచించడం.. భవిష్యత్ కార్యాచరణకు వైద్యశాఖ ప్రణాళిక రూపొందించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధానంగా దీర్ఘకాలికంగా దగ్గు వస్తుంటే తేలిగ్గా తీసుకోకూడదు. రెండు వారాలకు మించి దగ్గు వేధిస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్లె పరీక్ష చేయించుకోవాలి. దీర్ఘకాలిక దగ్గు క్షయ లక్షణం కావచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో పరీక్షలు చేయించుకుని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఔషధాలను సకాలంలో వాడితే క్షయ వ్యాధి తప్పకుండా నయం అవుతుంది. లేని పక్షంలో మొండిగా మారి కొన్ని సందర్భాల్లో ప్రాణాలు హరించే ప్రమాదం వుంది.

లక్షణాలు ఇవే ..

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు పడడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆలసటగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రధానంగా 60 ఏళ్లు దాటిన వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్థులు, పొగ ఇతర మత్తుపదార్థాలు వాడే వారిలో టీబీ ఎక్కువగా కనిపిస్తుంటుంది. క్షయవ్యాధి దగ్గు ద్వారా ఇతరులకు వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఇంటిలో టీబీతో బాధపడేవారికి మిగిలిన కుటుంబ సభ్యులను కొంత దూరంగా ఉండాలి.

నమోదైన కేసులు ఇలా..

జిల్లాలో 2024లో 1451 , 2025 ఫిబ్రవరి వరకు 507 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారు 883 మంది వరకు ఉన్నారు. బహుళ ఔషధ నిరోధక (ఎండీఆర్) టీబీ కేసులు 16 వరకు ఉన్నాయి. సందేహిత పరీక్షలకు నెలకు సగటున మూడు వేల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నాలుగు కేటగిరీలు...

క్షయవ్యాధిని నాలుగు కేటగిరీలుగా విభజిస్తారు. మొదటిసారి వ్యాధి బారిన పడితే కేటగిరీ-1గా భావిస్తారు. ఈ కేటగిరీలో ఉన్న వారికి ఆరు నెలల పాటు మందులు అందిస్తారు. రెండో సారి వస్తే కేటగిరీ-2గా గుర్తించి.. 8 నెలల పాటు మందులు అందిస్తారు. మొండి క్షయవ్యాధిగ్రస్థులను కేటగిరీ-3గా, ముదిరిపోయిన వ్యాధిగ్రస్థులను కేటగిరి-4ను పరిగణిస్తారు. వీరికి సుమారు రూ.18 లక్షల విలువైన మందులను ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది.

నిర్ధారణ ఇలా..

క్షయవ్యాధి నిర్ధారణకు పలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఎక్స్‌రే, సీబీనాట్ పరీక్ష ద్వారా ఈ వ్యాధి నిర్ధారణ చేస్తారు. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లోనూ టీబీ నిర్ధారణ పరీక్షలకు అవకాశం ఉంది. టీబీ కేంద్రంలో కాట్రిడ్జ్‌బేస్‌డ్ యూక్లిక్ యాసిడ్, యాంప్లిఫికేషన్ టెస్ట్ (సీబీనాట్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 49 నిర్దేశిత సూక్ష్మ పరిశీలన కేంద్రాలు, 19 ఆర్‌టీ-పీసీఆర్ కేంద్రాలు, ఏడు టీబీ యూనిట్లు ఉన్నాయి.

ఉచితంగా చికిత్స..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలను (మిగతా 8వ పేజీలో..)

ఏడుగురికి సేవా పతకాలు

● ఎస్పీ వకుల్ జిందాల్ ● ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

విజయనగరం క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలకుగాను, రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పండుగ సందర్భంగా పోలీసు మెడల్స్‌ను ప్రకటించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందికి ఉగాది పండుగ సందర్భంగా పోలీసు సేవా మెడల్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పోలీసుశాఖ పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పోలీసుశాఖలో ఎస్‌బీ ఎస్‌ఐ వై.సత్యనారాయణకు ఉత్తమ సేవాపతకం, ఎస్సీ-ఎస్టీ సెల్ ఏఎస్‌ఐ ఎం.ప్రసాదరావుకు సేవా పతకం, గుర్ల పోలీస్ స్టేషన్‌లోని హెచ్‌సీలు పి.రమణ, కె.గోపాలరావులకు సేవాపతకాలు, ఏఆర్ ఎస్‌ఐ కె.అప్పలరాజు, ఏఆర్ హెచ్‌సీ ఎం.గోవిందం, ఏఆర్ పీసీ బి.శ్రీనివాసరావు సేవా పతకాలకు ఎంపికైనట్టు రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసి నట్టు ఎస్పీ వకుల్ జిం దాల్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖ ప్రతిష్ఠను రాష్ట్రస్థాయిలో నిలిపి ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవా, సేవా పతకాలు పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష త్తులో పనిచేసి పోలీసు శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు.


సత్యనారాయణ, ఎస్‌బీ ఎస్‌ఐ


అప్పలరాజు, ఏఆర్ ఎస్‌ఐ


ప్రసాదరావు ఎస్సీ, ఎస్టీ సెల్ ఏఎస్‌ఐ


రమణ, హెచ్‌సీ


గోవిందం, హెచ్‌సీ


శ్రీనివాసరావు, కానిస్టేబుల్


గోపాలరావు, కానిస్టేబుల్

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

విజయనగరం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను నగరంలోని అయ్యన్న కోనేరుగట్టు వద్ద విజ్ఞాన భారతి స్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా త్యాగరాజస్వామి వేషధారణలో విద్యార్థులు తిరువీధి మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు. త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు.

నేడు కేఎస్ఎస్ కమిటీల ఏర్పాటు

లక్కవరపుకోట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసం వద్ద సోమవారం నిర్వహించనున్న పార్టీ సమావేశానికి నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు తెలిపారు. పార్టీ ఆదేశానుసారం క్షేత్రస్థాయిలో కుటుంబ సాధికార సారధి (కేఎస్ఎస్) కమిటీలు వేసేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. తప్పనిసరిగా అందరూ రావాలని కోరారు.

క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులు

విజయనగరం రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రియాశీలక కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లా పార్టీ కార్యాలయానికి కార్డులు చేరాయి. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 25, 26న జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పంపిణీ చేయనున్నారు.

ఎస్.కోట ఆసుపత్రికి అల్ట్రా సౌండ్‌స్కాన్

శృంగవరపుకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కాన్ సిస్టం అందుబాటులోకి వచ్చినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు గర్భిణులు ఈ పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించేవారు. ఇక నుంచి గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కాన్ ఆసుపత్రిలోనే చేపట్టనున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

రేగిడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపుర్లిలోని చిన్మయిదేవి సమేత చిదంబరేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ, ప్రధాన ధర్మకర్తల నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంత్‌శర్మ, గ్రామ పురోహితులు మావుడూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

మెరకముడిదాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సింగవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్.ప్రశాంతి కోరారు. ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత సంవత్సరంలో తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే ఉచిత పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన భోజనం, యూనిఫారం, బెల్టు, షూ, బ్యాగు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజాకుమారి, జ్యోతి, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

110 మందికి నేత్ర పరీక్షలు

బొండపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంద్రాంలో ఆదివారం రామదండు యువత ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటైంది. విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు శిబిరానికి హాజరయ్యారు. 110 మంది రోగులను పరీక్షించి అందులో 26 మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు.

● లక్కవరపుకోట: పెదిరెడ్లపాలెంలో ఆదివారం విశ్వమంథా ట్రస్టు అధ్యక్షుడు ఎంఎల్‌వీ శర్మ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 32 మందికి కళ్లద్దాలకు సిఫారుసు చేశారు.

వృద్ధులే ఈతరం సంపద


వృద్ధులకు చీరలు అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

జామి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఈతరానికి అమూల్యమైన సంపద వృద్ధులేనని, వారిని చక్కగా ఆయా కుటుంబాల వారు సంరక్షించుకోవాలని కలెక్టర్ అంబేద్కర్ అన్నారు. మండలంలోని అట్టాడలోని బీఎన్‌ఆర్ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులను కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి వారితో మాట్లాడారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు బీశెట్టి శారద, డాక్టర్ బాలభార్గవిలను ప్రశంసించారు. ఎటువంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, సర్పంచ్ అమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు కలెక్టర్‌ను సత్కరించారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగండి


కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులైన మహిళలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విభిన్న ప్రతిభావంతుల శిక్షకురాలు వెలిచేటి లక్ష్మి అన్నారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపవర్‌మెంట్ విభిన్న ప్రతిభావంతుల మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాటలు రాకపోయినా, సైగల భాషతో ఎంతో మంది మహిళలు నేడు ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో మహిళలు విద్యను అభ్యసించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆశాజ్యోతి, రాధ, హైమావతి, స్వర్ణ, లక్ష్మితో పాటు 120 మంది విభిన్న ప్రతిభావంతుల మహిళలు పాల్గొన్నారు.

ఆత్మకథలు నాటి పరిస్థితులకు ప్రతిబింబాలు


మాట్లాడుతున్న గణపతిరావు నాయుడు

రాజాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యక్తులు రాసుకున్న ఆత్మకథలు ఆనాటి సమాజ పరిస్థితులను ప్రతిబింబిస్తాయని సాహితీవేత్త రౌతు గణపతిరావు నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 12వ సమావేశం జరిగింది. సమావేశంలో ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథను సభ్యులకు గణపతిరావు నాయుడు పరిచయం చేశారు. బరంపురానికి చెందిన లక్ష్మణరావు జర్మనీ దేశస్థురాలు మిల్లి షోలింగర్‌ను వివాహం చేసుకోవడం, ఆ తర్వాత మంచి స్నేహితులుగానే మిగిలిపోవడాన్ని ఆయన వివరించారు. ఆదర్శ దంపతులుగా స్వాతంత్ర ఉద్యమానికి చేసిన సేవను వివరించారు. డాక్టర్ అల్లి మోహనరావు అధ్యక్షతన వహించిన సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, శాసపు సత్యనారాయణ, మూడడ్ల శ్రీనివాసరావు, పొట్నూరు కోటిబాబు, పొదిలాపు శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్, సమతం మహేశ్వరరావు, కుదమ తిరుమలరావు, జరజాన నీలయ్య, ఉరిటి గున్నేశ్వరరావు, వల్లూరు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 318 మంది ఎంపిక


ఎంపికైన వారితో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ

శృంగవరపుకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివేకానంద విద్యాసంస్థలో ఆదివారం నిర్వహించిన సంకల్ప్ మోగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 1450 మంది హాజరు కాగా 318 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి గొంప కృష్ణ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమార్, జామి టీడీపీ మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్, టీడీపీ నాయకురాలు గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, వివేకనంద విద్యాసంస్థల అధిపతి సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ ఉన్నారు.

టీడీపీలో పలువురి చేరిక


టీడీపీలో చేరిన వారితో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గంట్యాడలోని పలు కుటుంబాలు వైసీపీ నివీడి టీడీపీలో చేరాయి. ఆదివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో వారు చేరారు. పార్టీలో చేరిన వారిలో గంట్యాడకు చెందిన కొండపల్లి వెంకటరమణ, కె.కృష్ణ, కె.రవి, ఎస్.చక్రి, ఇ.గోవింద, కె.సురేష్, కోరాడ పైడితల్లి, కోరాడ రాంబాబుతో పాటు మరో 15 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, టీడీపీ నాయకులు మురళీబాబు, బూడి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

వేములాపల్లి అభివృద్ధి బాధ్యత నాదే..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములాపల్లి పంచాయతీ అభివృద్ధికి పూర్తి బాధ్యత నాదేనని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం వేములాపల్లిలో ఆమె పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోపాలపల్లి సర్పంచ్ మహేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్ నాయుడు, రామసత్యం, శ్రీనురాజు తదితరులున్నారు.

జడ్పీ చైర్మన్‌ను పరామర్శించిన సాయిరెడ్డి


శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న సాయిరెడ్డి

విజయనగరం దాసన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్‌బాబు మృతి చెందిన నేపథ్యంలో ఆయన్ని ధర్మపురిలోని నివాసంలో మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రణీత్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పడాల అరుణ, శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పేడాడ తిలక్, దువ్వాడ వాణితో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ని పరామర్శించారు.

నాటక పోటీలకు సహకరించండి


మాజీ ఎమ్మెల్యే గద్దెతో నాటక పోటీల నిర్వాహకులు

గరివిడి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గరివిడిలో మే 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలకు సహకరించాలని గరివిడి కళాపరిషత్ సభ్యులు కోరారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారులను కలిశారు. కళాకారులు కలిసిన వారిలో చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, టీడీపీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.త్రిమూర్తులురాజు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మండల టీడీపీ నేతలు ముల్లు రమణ, రెడ్డి గోవింద తదితరులు ఉన్నారు. ఉభయ రాష్ట్రాల తెలుగు నాటకాల పోటీలు విజయవంతం చేసేందుకు కొన్ని రోజులుగా కళాకారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

పేమెంట్ తీర్మానాల పేరిట ఇబ్బందులు

జామి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం పంచాయతీ కార్యదర్శి అనురాధ కొత్త సంప్రదాయాలు అమలు చేస్తున్నారని సర్పంచ్ పార్వతి ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ పనిచేసినా తీర్మానం సరిపోయేదన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి పేమెంట్ తీర్మానాలు అంటూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనివల్ల గ్రామాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. అన్ని పంచాయతీల్లో ఎలా తీర్మానాలు జరుగుతున్నాయో ఇక్కడ కూడా అదే పద్ధతి ఉండేలా చూడాలని అధికారులను ఆమె కోరారు.

కొత్తవలసకు ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి


న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తవలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ జిలా కోర్టు న్యాయాధికారి అప్పలస్వామి ఆదివారం కొత్తవలస కోర్టును సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తవలస కోర్టుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక కోర్టు న్యాయాధికారి డాక్టర్ విజయ్‌చందర్, న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, ప్రధాన కార్య దర్శి డి.శ్రీనివాస్, కె.మహేశ్వరరావు, గవర కృష్ణ శ్రీరామ్మూర్తి, ఉమాదేవి, నాయుడు తదితరులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం కోర్టులో వివిధ కేసులకు సంబంధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

దుర్గమ్మ విగ్రహం ధ్వంసం


అమ్మవారి చేతుల్లోని ఆయుధాలు ధ్వంసం చేసిన దృశ్యం

బొండపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోడసింగిపేటలో నిర్మాణమవుతున్న సీతారామాంజనేయుల ఆలయంలోని దుర్గమ్మవారి విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆలయ నిర్మాణకర్త, సర్పంచ్ మీసాల జానకిరావు మాట్లాడుతూ ప్రజల విరాళాలతో గ్రామంలో నిర్మాణం చేపడుతున్నామన్నారు. కోవెల ప్రహరీని ఆనుకుని రూపుదిద్దుకున్న దుర్గమ్మ విగ్రహం రెండు చేతులు ధ్వంసం చేశారన్నారు. ఈ విషయమై ఆయన బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.

జరజాపుపేట ఇన్‌చార్జి వైద్యురాలిగా కల్పన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లిమర్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నెలిమర్ల నగర పంచాయతీలోని జరజాపుపేట యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలిగా కల్పనను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు నియమించారు. జరజాపుపేట యూపీహెచ్‌సీలో ఇంతకాలం పనిచేసిన డాక్టర్ వి.దక్షయ్ రామనాయుడు ఇటీవల ఉన్నత చదువుల కోసం వెళ్లడంతో నెల రోజులుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. 'స్టాఫ్ నర్సుతో వైద్యసేవలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. డాక్టర్ కల్పనను ఇన్‌చార్జిగా నియమించారు. ఈమె ప్రస్తుతం పూల్‌బాగ్ కాలనీ యూపీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. వారంలో మూడు రోజులు పూల్‌బాగ్ యుపీహెచ్‌సీలో, మూడు రోజులు జరజాపుపేట యూపీహెచ్‌సీలోనూ విధులు నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నట్టు సమాచారం.

పెదమానాపురంలో ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన వాహనాలు

దత్తిరాజేరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం వద్ద వంతెన పనుల్లో భాగంగా ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం జరిగింది. పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వన్‌వే ఇవ్వడంతో రెండువైపులా 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. నెమ్మదిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి. స్పందించిన పోలీసులు ట్రాఫిక్‌ను నెమ్మదిగా క్లియర్ చేశారు. పనులు నిరంతరాయంగా జరగడంతో రోజంతా రద్దీ కొనసాగింది.

భగత్‌సింగ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న మానవత ప్రతినిధులు

రాజాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని సర్దార్ భగత్ సింగ్‌కు వర్ధంతిని ఆదివారం మానవత సంస్థ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1907లో జన్మించి చిన్నతనంలోనే భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జీవితకాల దేశ బహిష్కరణకు గురయ్యారన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో పేరు పొందారన్నారు. భగత్‌సింగ్ జైలులో ఖైదీగా ఉన్నపుడు సమాన హక్కులు కల్పనకై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.వి.అచ్యుత్‌కుమార్, ఉపాధ్యక్షులు గట్టి పాపారావు, మక్కా అప్పలనాయుడు, సామాజిక కార్యకర్త పెంకి చైతన్యకుమార్, రాజాం పర్యావరణ సమితి అధ్యక్షుడు ఆర్‌వీజే నాయుడు, యామన భాస్కరరావు, దామెర రాజా, శాసపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కొండగుంపాంలో..

● నెల్లిమర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని కొండగుంపాంలో ఆదివారం సీపీఐ నిర్వహించింది. సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలు కీర్తించారు. కార్యక్రమంలో పోలిపల్లి సూరి, ఎడ్ల పైడినాయుడు, లంక రాజారావు, నడిపేన రామ్మూర్తి పాల్గొన్నారు.

గౌరవం లేని పదవులు ఎందుకు?

● మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన


మాట్లాడుతున్న కాళంరాజపేట సర్పంచ్

గజపతినగరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌లకు కనీస గౌరవం దక్కడంలేదు.. అధికారులు కనీసం గుర్తింపు కూడా ఇవ్వకుంటే ఎందుకీ సర్పంచ్ పదవులని పాతశ్రీరంగరాజపురం, కాళంరాజపేట, మధుపాడ సర్పంచ్‌లు మండల సమావేశంలో ఆవేదనను వెళ్లగక్కారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ జేఈ అప్పలనాయుడు పల్లె పండగలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులపై మాట్లాడుతుండగా గ్రామాల్లో గ్రామసభలు ద్వారా తీర్మానాలు చేసిన పనులు గ్రామాల్లో జరగడం లేదని మధుపాడ సర్పంచ్ అన్నారు. పంచాయతీలో 24 పనులకు తీర్మానం చేస్తే నాలుగు పనులే చేపడుతున్నారనీ, అదీ సర్పంచ్‌కు తెలియజేయకుండా చేపట్టడం ఎంత వరకు సమంజనం అని జేఈని నిలదీశారు. గ్రామంలో అంగన్వాడీ భవనం పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు రావడం లేదని అధికారులు చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని కాళంరాజపేట సర్పంచ్ ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లను అధికారులు తిప్పుతుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గ్రామానికి అధికారులు వస్తే వారికి సర్పంచ్‌లు అవసరం.. కానీ సర్పంచ్‌ల అవసరాలకు అధికారులు ఉపయోగపడరా అంటూ పాతశ్రీరంగరాజపురం సర్పంచ్ గిడిజాల కామునాయుడు ప్రశ్నించారు దీంతో ఎంపీడీవో బి.కల్యాణి మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామానికి ప్రథమ పౌరులని, వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు సర్పంచ్‌లతో పాటు గ్రామపెద్దల సమక్షంలో చేపట్టేలా కృషి చేయాలని సూచించారు. ప్రతీ సమావేశానికి తహసీల్దారు గానీ డీటీ గానీ గైర్హాజరు కావడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి, కర్రి శ్రీదేవి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గంటలోనే ముగిసిన సమావేశం

● పలు శాఖలపై జరగని సమీక్ష
● గరివిడి మండల సమావేశం తీరిది..


మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

గరివిడి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించేందుకు మూడు నెలలకు ఒకసారి మండల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశం సుదీర్ఘంగా సుమారు 3 గంటల పాటు వాడివేడిగా జరగాల్సి ఉంది. కానీ ఆదివారం ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా గంటలోనే ముగిసింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ సమావేశం కోరం చాలక పోవడంతో 11.30 గంటలకు ప్రారంభమై 12.30 గంటలకు ముగిసింది. చాలా వరకు కొన్ని శాఖలపై సమావేశంలో సమీక్ష కూడా నిర్వహించలేదు. మండలంలో 20 మంది ఎంపీటీసీ సభ్యులకు గానూ 13 మంది, 30 మంది సర్పంచులకు గానూ 10 మందే హాజరయ్యారు. వివిధ శాఖల పరిధిలో 20 మంది అధికారులు, సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. సమావేశంలో గెడ్డపువలస సర్పంచ్ టి.సూరినాయుడు మాట్లాడుతూ డీఎఫ్ఎన్, గెడ్డపువలస ప్రాంతాలలో పరిమితికి మించి మైనింగ్ తవ్వకాలు జరగడం వల్ల తాగునీటి సమస్య తలెత్తుతోందన్నారు. కోనూరు, వెదుళ్లవలస సర్పంచ్‌లు మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. రేగటి సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ తమ పంచాయతీలో గతేడాదిగా పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. పాత గరివిడి ఎంపీటీసీ ఎడ్ల సూరిబాబు మాట్లాడుతూ గర్భాం రోడ్డులో రహదారి నుంచి వస్తున్న కాలుష్య సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దారు బంగార్రాజు, ఎంఈవో పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలి



కిమ్మిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరఘట్టం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 25న జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించనున్నామని చెప్పారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కిమ్మి గ్రామంలో 'మన ఊరు బడిని కాపాడుకుందాం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ స్టేట్ కల్చరల్ కమిటీ మెంబర్ కొండపల్లి గౌరునాయుడు, జిల్లా కార్యదర్శి మజ్జి పైడి రాజు, జిల్లా కౌన్సిలర్ అరసాడ చంద్రమోహన్, కర్రి సింహచలం, వీరఘట్టం మండల కోశాధికారి బోనంగి వాసుదేవరావు, సీతంపేట నాయకులు శిలా గణేష్, కిమ్మి గ్రామ సర్పంచ్ గురాన రామ్మోహన్‌నాయుడు, గడగమ్మ గ్రామ సర్పంచ్ ఉదయాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎగువశెంబి ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్తాం



ఎగువశెంబిలో న్యాయసలహాదారు మహేశ్వరరావు

సాలూరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూపు గ్రామం ఎగువశెంబిలో ఒడిశా వాసులు గిరిజనుల భూములను ఆక్రమించి కంచె వేసిన ఘటనను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు గిరిజన ఉద్యోగుల న్యాయ సలహాదారు రేగు మహేశ్వరరావు తెలిపారు. కొఠియా గ్రూపు ఎగువశెంబి గ్రామంలో ఆయన ఆదివారం పర్యటించారు. ఏపీ ప్రభుత్వం గిరిజనులకు మంజూరు చేసిన ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో వేసిన కంచెను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కొఠియా గ్రూపు గ్రామాలపై సుప్రీంకోర్టు మంజూరు చేసిన స్టేటస్‌కో అమల్లో ఉన్నప్పటికీ ఒడిశావాసులు అక్రమంగా కంచె నిర్మించారన్నారు. ఈ విషయమై జనసేన పార్టీ ద్వారా సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. కొఠియా గ్రామాలపై ఒడిశాతో చర్చించాలని కోరతామని ఆయన తెలిపారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

సీతంపేట రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుంటే పోరాటం చేపట్టి పేదలకు అండగా ఉంటామన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి పేదవాడికి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేస్తూ, ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 25వ తేదీన అర్హులైన లబ్ధిదారులు పార్వతీపురం మన్యం కలెక్టర్ కార్యాలయానికి ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ జతపరిచి కలెక్టర్‌కు అందజేసేందుకు కార్యాలయానికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయనతో పాటు సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా బాధ్యులు జి.ఈశ్వరయ్య ఉన్నారు.

అకాల వర్షం



గుంతల్లో చేరిన వర్షపునీరు

భామిని, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల అకాల వర్షం కురిసింది. ఒడిశా గుణుపూర్ వైపు నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. ఈ వర్షం రబీలో వేసిన వరి, నువ్వు, జీడి మామిడి పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని బత్తిలి, కాట్రగడ, గురండి, భామిని, సొలికిరి వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది. అయితే ఈ వర్షం వల్ల అలికాం-బత్తిలి రహదారి గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఆదివారం రాత్రి వర్షం పడింది. ఏజెన్సీలో చెరువుల్లో నీరు చేరుతుందని రైతులు భావిస్తున్నారు.

ఉగాది వేడుకలకు శుభరాట

ఒడిశా



శుభరాట స్థాపనలో పాల్గొన్న భాస్కరరావు

రాయగడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలకు ఆదివారం స్థానిక న్యూకాలనీ తేజస్వీ మైదానంలో శుభరాట స్థాపన నిర్వహించారు. పూర్వ రాజ్యసభ సభ్యుడు, బిజూ జనతాదళ్ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరరావు పాల్గొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్, చంద్రమౌళి కుముందాన్ రాఘవ కుముందాన్, త్రినాథరావు(సీపీ), వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మునిగుడలో గుర్తు తెలియని మృతదేహం

రాయగడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మునిగుడ రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఓ టెలా బండిపై పడిఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సామాజిక సేవకుడు జామి మహేష్, కొంత మంది యువకుల సహాయంతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

రాయగడలో రంగవల్లుల పోటీలు

రాయగడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక పురపాలక టౌన్‌హాలులో జిల్లా ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో వేదపఠనం, రంగవల్లుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాలుగా నిర్వహించిన వేదపఠనం పోటీలో జూనియర్ విభాగంలో విజేతలుగా బి.హర్షవర్ధని, సాయిఅశ్రిత, ఎం.ప్రీతి, సీనియర్ విభాగంలో ఎం.సునీత సబర్, సంతోషిణి, కె.లావణ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పి.రమాదేవి, విజయ్‌కుమార్ అగర్వాల్‌లు వ్యవహరించారు. రంగవల్లుల పోటీల్లో ఎస్.సోనాలి, బి.ప్రీతి, ఎంపీ ఇందు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. న్యాయ నిర్ణేతలుగా దర్శిణి జైన్ బి.లక్ష్మి, చంచల్‌జైన్ వ్యవహరించారు. కార్యక్రమ నిర్వహణలో విజయలక్ష్మి పి.మణిరత్నం, పి.రాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

● జిల్లాలో వర్ధంతి కార్యక్రమాలు

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలు చోట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అనే ముగ్గురు స్వాతంత్ర సమర యోధులకు బ్రిటిష్‌వారు ఒకేసారి ఉరిశిక్ష వేశారని గుర్తుచేశారు. 24 ఏళ్ల వయస్సులో దేశం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి, యువతకు ఉత్తేజాన్ని నింపిన సమర యోధుడు భగత్‌సింగ్ అని అన్నారు.



బెలగాం: నర్సిపురంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్



సాలూరు: భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, పట్టణ సీఐ అప్పలనాయుడు



సాలూరు రూరల్: బెల్లపాకలో సీపీఎం, ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో నివాళి అర్పిస్తున్న దృశ్యం

గిరిజనుల గొంతెండుతోంది!

(ఐదో పేజీ తరువాయి)

లంబగూడ, దబర, ఒవ్వమానుగూడ, బూతాయిగూడ, మొగదారగూడలో నీటి ఎద్దడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కానీ ఇక్కడ పరిస్థితి చూస్తే వేరేలా ఉంది. రానున్న రోజుల్లో నీటి ఎద్దడి గ్రామాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఎందుకీ తాత్సారం

● గిరిపుత్రులు ఏటా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అటు ఐటీడీఏ, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై గిరిజనులు ఐటీడీఏ గ్రీవెన్స్‌లో ఎన్నిసార్లు వినతులు ఇచ్చిన స్పందించే వారే కరువయ్యారు.

● ఏటా మండు వేసవిలో గిరిశిఖర గ్రామాలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే వారు. అయితే ఈ ఏడాది అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా ఉన్న కొద్దిపాటి నీటి లభ్యత కూడా పూర్తిగా అడుగంటే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో ఉన్నతాధికారులు స్పందించి గిరిశిఖర గ్రామాలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామంలో గ్రావి టేషన్ ఫ్లో పథకం పనిచేయడం లేదు. కొండదిగువన ఉన్న బావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. దీనిపై ఐటీడీఏ అధికారులు స్పందించాలి.

\- సవర సురేష్, అంటిమానుగూడ

శాశ్వత పరిష్కారం చూపాలి..



గిరిజన ప్రాంతాల్లో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. బోర్లు, సోలార్ వాటర్ స్కీంలకు మరమ్మతులు చేయించాలి. మిగిలిన గ్రామాలకు ఐటీడీఏ ద్వారా ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలి.

\-జి.శ్రీరాములు, గిరిజన సంఘం నాయకుడు

ప్రతిపాదనలు పంపించాం..

నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు గాను రూ.4.9లక్షల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సర్పంచ్‌ల సహకారంతో పంచాయతీ నిధులతో కూడా ఆయా గ్రామాల పరిధిలో ఉన్న బోర్లు, గ్రావిటేషన్ ఫ్లోలు, సోలార్ వాటర్ స్కీంలకు మరమ్మతులు చేయిస్తాం.

\- మధుసూదనరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

● 31వ 'మిస్టర్ ఆంధ్రా' బరిలో 200 మంది

● విజేతలకు బహుమతుల ప్రదానం

పార్వతీపురంటౌన్, ఆంధ్రజ్యోతి 23 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం బైపాస్ రహదారిలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం రాత్రి 31వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన 200 మంది బాడీ బిల్డర్స్ హాజరయ్యారు. వారంతా పది విభాగాల్లో పోటీ పడ్డారు. 55 నుంచి 85 కేజీలతోపాటు మాస్టర్స్, మెన్స్ ఫిజిక్ పోటీల్లో సత్తా చాటారు. అర్నాల్డ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రెప్టన్ జిమ్ సహకారంతో రెండో సారి నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత ఈ పోటీలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. నేటి యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. వ్యసనాలకు బానిసలు కారాదని, సన్మార్గంలో పయనించాలని హితవు పలికారు. అనంతరం 55 కేజీల విభాగంలో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

అండర్ 55 కేజీల కేటగిరిలో విశాఖపట్నానికి చెందిన డి.గంగరాజు విజేతగా నిలిచారు. 55-60 కేజీల కేటగిరిలో ఆర్.చరణ్, 60-65 కేజీల కేటగిరిలో అనకాపల్లికి చెందిన పి.ప్రసాద్, 65-70 కేజీల కేటగిరిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వి.సంతోష్‌కుమార్, మాస్టర్స్ 45 కేటగిరిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పి.అప్పారావు, మాస్టర్స్ 55 కేజీలో మన్యం జిల్లాకు చెందిన కె.గౌరీశంకర్, మెన్స్ ఫిజిక్ కేటగిరిలో విజయనగరం జిల్లాకు చెందిన వరుణ్‌కుమార్ విజేతలుగా నిలిచినట్టు అర్నాల్డ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు హరిప్రసాద్ తెలిపారు.

టీబీ కేర్‌ఫుల్

(ఐదో పేజీ తరువాయి)

ఉచితంగా అందజేస్తున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ జరిగిన రోగులకు ఔషధాలను ఆరు నెలల పాటు ఉచితంగా అందజేస్తారు. ఈ ఔషధాలు క్రమం తప్పకుండా వాడితే టీబీ పూర్తిగా తొలగిపోతుంది. వీరికి పోషకాల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి నెలా వెయ్యి రూపాయలు అందజేస్తున్నారు.

ఇంటి వద్దే పరీక్షలు



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గిరిజన ప్రాంతాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి టీబీ పరీక్షలు చేపడుతున్నాం. హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మిషన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. వాని ద్వారా లక్షణాలు ఉన్న వ్యక్తి ఇంటి వద్దే నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ముఖ్యంగా షుగర్ బాధితులు 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, పొగతాగే అలవాటు ఉన్న వారు, గుట్కా, పాన్ తినేవారికి పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలోనూ పరీక్షలు చేస్తు న్నాం. ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి బారిన పడేవారు ఆరు నెలల పాటు క్రమం తప్ప కుండా మందులు వినియోగించాలి.

\- ఎం.వినోద్‌కుమార్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పరిధిలోని కేజీబీవీల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని రావివలస కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఛాయాదేవి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రవేశాలకు అవసరమైన మార్గదర్శకాలను రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు విడుదల చేశారని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 11 తరగతులకు సంబంధించి ప్రవేశాల కోసం, అలాగే 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి అర్హులైన బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రవేశాలకు అనాథలు, బడి బయట ఉన్నవారు, బడి మానేసిన వారు, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ ఈనెల 22 నుంచి ప్రారంభమైందన్నారు. ఏప్రిల్ 11లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6, 7, 8, 9 తరగతులకు సంబంధించి 16న పరిశీలన, 21 నుంచి 25 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు.

ఘనంగా జాకరమ్మ జాతర



పాలజంగిడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఇలవేల్పు జాకరమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు పిన్నింటి వెంకట రమణ నివాసం వద్ద జాకరమ్మ పాలజంగిడికి ఆ ఇంటి పెద్ద అప్పలనరసమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ పాలజంగిడిని ఆలయ పూజారి జన్ని రాజారావు ప్రధాన రహదారి మీదుగా ఊరేగింపుగా తీసుకువెళ్లి బైపాస్ రహదారిలో గల ప్రధాన ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

స్వయం ఉపాధి యూనిట్లకు గడువు పెంపు

గరుగుబిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెను కబడిన వర్గాల వారు స్వయంఉపాధి యూనిట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అర్హులైన వారు ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22లోగా గడువు ముగిసినప్పటికీ మరో మూడు రోజులు పెంపు చేశారన్నారు. అర్హులైన వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మృతదేహం గుర్తింపు

గరుగుబిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మరుపెంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి నట్టు ఎస్ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామానికి ఆనుకుని ఉన్న నాగావళి నది మార్గంలో నీటి సరఫరా తగ్గుముఖం పట్టడంతో మృతదేహం బయటపడిందన్నారు. గ్రామ స్థుల సమాచారం మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించి శవ పంచనామా నిర్వహించామని తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలియట్లేదని అన్నారు. ఈ పరిశీలనలో వీఆర్వో కె.రాఘవరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాలకొండ అభివృద్ధే లక్ష్యం



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ ప్రతాప్

పాలకొంబ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సహకారంతో పాలకొండ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్ అన్నారు. మండలంలోని ఓని రోడ్డులో ఉన్న తాత్కాలిక డంపింగ్‌యార్డును ఆయన ఆదివారం సందర్శించారు. పాలకొండలో దశాబ్ద కాలంగా డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామన్నారు. రానున్న రోజుల్లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు.

రిజర్వేషన్లపై పునరాలోచించాలి

● రెల్లికుల రాష్ట్ర అభివృద్ధి సంఘం సభ్యులు



పాలకొండ: అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న రెల్లికుల రాష్ట్ర అభివృద్ధి సంఘం సభ్యులు

పాలకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో భాగంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెల్లి కులస్థులకు ఒక శాతం రిజర్వేషన్ కేటాయింపు పునరాలోచన చేయాలని రెల్లికుల రాష్ట్ర అభివృద్ధి సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆందోళన చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ వర్గీకరణలో రెల్లి, వాటి ఉపకులాలకు జనాభా ప్రాతిపదికన కాకుండా ఆర్థిక, సాంఘిక, విద్య, వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీ-ఏగా గుర్తించి రెండు శాతం నుంచి ఐదు శాతం రిజర్వేషన్‌ను కేటాయించాలని కోరారు. విద్య, ఉద్యోగ ఆర్థిక విషయాలలో రెల్లి, వాటి ఉపకులాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుల గణన తర్వాతే వర్గీకరణ చేయాలి



జియ్యమ్మవలస: చినమేరంగిలో నినాదాలు చేస్తున్న రెల్లి కులస్థులు

జియ్యమ్మవలస, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీల్లో వర్గీకరణ అనేది కుల గణన జరిగిన తర్వాతే చేయాలని రాష్ట్ర రెల్లి కులాల జేఏసీ అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన చినమేరంగి గ్రామానికి వచ్చి రెల్లి కులస్థులతో మాట్లాడారు. ఎస్సీ కులాలన్నీ ఒకటేనని, ఇందులో విభజన చేసి తమలో తారతమ్యం తీసుకురావద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్ కల్పించాలన్నారు. నాలుగు లక్షల జనాభా ఉన్న బేడ, బుడగ జంగం కులాలను ఎస్సీ బీలో గానీ, ఎస్సీ సిలో గానీ కలపాలన్నారు. తర్వాత ప్రధాన రహదారిపై నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి కులస్థుల మన్యం జిల్లా కన్వీనర్ వెలగాడ గురువులు, పైడి కులాల రాష్ట్ర అధ్యక్షులు కోట సుందర్ సుదర్శన్, అధిక సంఖ్యలో రెల్లి కులస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ద్విగళ అష్టావధానం

పాలకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాలకొండ సూర్య చంద్ర కళా సాహితీ ఆధ్వర్యంలో ద్విగళ అష్టావధానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. అవధాని బంకుపల్లి రమేష్‌శర్మ, అవధాన చంద్రమాస శతావధానులు చంద్రశేఖర వర్మ, సాయికుమార్‌శర్మను ఎమ్మెల్సీ విక్రాంత్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కనపాక చౌదరినాయుడు, సింహాచలాచార్యులు, బౌరోతు శంకరరావు, అల్లెన దిలీప్‌కుమార్, సాహిణి శ్రీనివాసరావు, గారాల సూర్యం, బొమ్మిరెడ్డిపల్లి వెంకట గణేశ్వరరావు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపండు పిక్కతీసే కేంద్రం ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం కేంద్రంగా గిరిజన సహకార సంస్థ వారు చింతపండు పిక్కతీసే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అడ్డాకుల చిన్నారావు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గిరిజన సహకార సంస్థ రైతులు సేకరించిన చింతపండును కొనుగోలు చేస్తుందని, ఈ చింతపండుకు పిక్కతీసి వ్యాలిడీ ఎడిషన్ చేస్తే అధిక ధర పలుకుతుందన్నారు. చింతపండు కేంద్రాన్ని గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేస్తే స్థానిక గిరిజన పేద మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు. చింతపండు పిక్క తీసే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.